నమస్తే తెలంగాణ

ములుగు

జయశంకర్ భూపాలపల్లి

5 | వరంగల్, శనివారం 29 మార్చి 2025 | MULUGU JAYASHANKAR BHUPALPALLY




దేవరుప్పులలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

# రైతులు గోసపడుతుంటే సంబురాలా?

- మా పోరాటాల ఫలితంగానే పంప్‌లు ఆన్ చేసిన మంత్రులు
- కేసీఆర్ హయాంలోనే దేవన్నపేట పంప్‌హౌస్ పూర్తయ్యింది
- ఎండిన పంటలకు రూ. 25 వేల నష్టపరిహారం ఇచ్చే దాకా బీఆర్‌ఎస్ పోరాటం
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

దేవరుప్పుల, మార్చి 28: యాసంగి పంటలు ఎండి రైతులు గోస పడుతుంటే మంత్రులు వచ్చి పంపులు ఆన్ చేసి సంబురాలు జరుపుకుంటారా.. అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మండి పడ్డారు. దేవరుప్పుల మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. కేసీఆర్ హయాంలో పూర్తయిన దేవన్నపేటలోని ప్రాజెక్ట్‌ను 14 నెలల క్రితం ప్రారంభించాల్సి ఉండగా పట్టించుకోని ఈ ప్రభుత్వం, మా పోరాటాల ఫలితంగానే నేడు మంత్రులు వచ్చి స్విచ్చాన్ చేశారని అన్నారు. మోటర్లను ఆన్ చేసి నీళ్లొదిలి చేతులు దులుపుకుంటే ఊరుకునేది లేదని, ఎండిన ప్రతి ఎకరాకు రూ. 25 వేలు నష్టపరిహారం చెల్లించేవరకు వదలిపెట్టమన్నారు. ఇందు కోసం బీఆర్‌ఎస్ పార్టీ రైతుల పక్షాన పోరాటం చేస్తుందని, దేవరుప్పుల మండలంలో ఆరంభమైన ఈ పోరాటం రాష్ట్రవ్యాప్తమవుతుందన్నారు. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వడం లేదని, రుణమాఫీ చేయడం లేదని, ఆర్థిక బాధలతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే బీమా అందడం లేదని పేర్కొన్నారు. వీటికి తోడు యాసంగి పంటలు నీళ్లు లేక ఎండ డంతో రైతు కుంగిపోయాడని, కోలుకోవడానికి ఏండ్లు పడుతుందని, ప్రభుత్వం ఎండిన పంటలకు నష్టపరిహారం చెల్లిస్తే కొంతైనా ఊరటగా ఉంటుందని ఎర్రబెల్లి అన్నారు.

***ఆ క్రెడిట్ మాకే దక్కుతుంది***

ఏ గ్రామం వెళ్లినా ఎండిన పంటలే దర్శనమిస్తున్నాయని, రైతుల బాధలు చూడలేక దేవాదుల నీళ్లు వదలాలని మంత్రులను, అధికారులను ప్రాధేయపడి, నిలదీసి, ఆందోళనలు చేసినా ప్రభుత్వం కనికరించలేదన్నారు. చివరకు పంటలు ఎండి రైతు కన్నీళ్లు పెడుతున్న సమయంలో నీళ్లు వదిలి సంబురాలు జరుపుకుంటారా అని ప్రశ్నించారు. మీరు ఆర్భాటంగా ప్రారంభించినా ఆ క్రెడిట్ తమకే దక్కుతుందన్నారు. ఎవరి ఒత్తిడితో నీళ్లొచ్చాయో రైతులకు తెలుసని ఎర్రబెల్లి అన్నారు. దేవాదుల నీటితో రిజర్వాయర్లు నిండగానే కాల్వల ద్వారా జనగామ, పాలకుర్తి నియోజకవర్గాల్లోని చెరువులు, కుంటలు నింపాలన్నారు. ఆ నీళ్లు పశువులు, పక్షులకు ఆసరాగా ఉంటాయని, సాగునీరు, తాగునీరు లభ్యత పెరుగుతుందని చెప్పారు. ముందు చూపుతో ఆలోచించి నీటి వనరులన్నీ నింపాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. జనగామ జిల్లాకు ఏకైక వన రైన దేవాదుల నీరు సంవత్సరం మొత్తం పంపింగ్ చేసే సామర్థ్యం ఉన్నా, 14 నెలలుగా ప్రభుత్వ నిర్వాకం, మంత్రులు అవగాహనారాహిత్యం వల్ల రైతులు భారీగా నష్టపోయారన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి సమస్యలు రాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు.



ఎల్కతుర్తిలో సభ ఏర్పాట్లను పరిశీలించి మ్యాపులను చూస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

# చరిత్రాత్మక ఘట్టానికి వేదిక

- ఎల్కతుర్తిలోనే బీఆర్‌ఎస్ సభ
- తుది పరిశీలన పూర్తి

హనుమకొండ సబర్బన్, మార్చి 29 : బీఆర్‌ఎస్ రజతోత్సవ వేడుకలకు ఎల్కతుర్తి మండలంకేంద్రం వేదిక కానున్నది. ఈ మేరకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తుది నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. అధినేత కేసీఆర్ నిర్ణీత సభా స్థలానికి ఉమ్మడి జిల్లాకు గతంలో పార్టీ ఇన్‌చార్జిగా పనిచేసిన గ్యాదరి బాలమల్లును శుక్రవారం పంపించి తుది పరిశీలన చేయించారు. ఆయనతో పాటు జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు వొడితల సతీశ్‌కుమార్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, నాగుర్ల వెంకటేశ్వర్లు, వాసుదేవారెడ్డిలు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. సభా వేదిక స్థలాన్ని గుర్తించి నాలుగు పార్కింగ్ స్థలాలను కూడా ఫైనల్ చేశారు. సభా స్థలంతో పాటు పార్కింగ్‌కు కూడా సుమారు 1000 ఎకరాల వరకు అనువుగా ఉన్న స్థలాలను గుర్తించి ఆయా స్థలాల రైతులతో నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్లు కూడా తీసుకున్నారు. అలాగే సౌండ్ సిస్టం, ఎల్‌ఈడీ స్క్రీన్‌ల, లైట్ల బిగింపు కోసం సాంకేతిక నిపుణులు కూడా వచ్చి సర్వే చేసుకుంటున్నారు. వరంగల్‌తో పాటు కరీంనగర్, సిద్దిపేట వైపు నుంచి వచ్చే వాహనాలేవీ ఎల్కతుర్తి జంక్షన్ వద్దకు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సువిశాలమైన పార్కింగ్‌కు రూపకల్పన చేస్తున్నారు. కేవలం అర కిలోమీటర్ దూరంలోనే సభావేదిక ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. నేతల వెంట స్థానిక నాయకులు కరీంనగర్ డీసీసీబీ డైరెక్టర్ శ్రీపతి రవీందర్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పిట్టల మహేందర్, పెరెడ్డి రవీందర్‌రెడ్డి, కడారి రాజు, మండల సురేందర్, తంగెడ నగేశ్, తంగెడ మహేందర్, గొల్లె మహేందర్, మునిగడప శేషగిరి, కోరె రాజ్‌కుమార్, గడ్డం రవి, చిట్టి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ పార్టీ బీఆర్‌ఎస్ : దాస్యం వినయ్‌భాస్కర్



హనుమకొండ జిల్లాలోని ఎల్కతుర్తి మండలకేంద్రంలో లక్షలాది మందితో బీఆర్‌ఎస్ రజతోత్సవ మహాసభను నిర్వహిస్తున్నట్లు పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ తెలిపారు. తెలంగాణ ప్రజల 60 ఏండ్ల కలను సాకారం చేసిన పార్టీ బీఆర్‌ఎస్ ఒక్కటేనన్నారు. ఒకే ఒక్కడిగా మొదలైన కేసీఆర్ ప్రాణాలకు తెగించి కొట్లాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని చెప్పారు. 25 ఏండ్ల పాటు ప్రజల ఆకాంక్షల మేరకు బీఆర్‌ఎస్ పనిచేసిందన్నారు. దేశమంతా తెలంగాణ వైపు చూసేలా చేసిన నాయకుడు కేసీఆర్ అని చెప్పారు. బీఆర్‌ఎస్ తెలంగాణ ప్రజల పార్టీ అన్నారు.



హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, చిత్రంలో మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఒడితెల సతీశ్‌కుమార్, తాటికొండ రాజయ్య, చల్లా ధర్మారెడ్డి, శంకర్‌నాయక్, తదితరులు

# ఎల్కతుర్తిలో బీఆర్‌ఎస్ రజతోత్సవ మహాసభ

## మరో 25 ఏండ్ల ప్రణాళికకు అంకురార్పణ

- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్
- తెలంగాణ పార్టీ బీఆర్‌ఎస్ : దాస్యం వినయ్‌భాస్కర్

హనుమకొండ, మార్చి 28 : బీఆర్‌ఎస్ రజతోత్సవ మహాసభ వచ్చే 25 ఏండ్ల తెలంగాణ ప్రగతికి ప్రణాళికగా ఉంటుందని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. కొత్త తరానికి కొత్త ఆలోచనలు కలిగించే వేదికగా ఈ బహిరంగ సభ ఉంటుందని చెప్పారు. బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, చల్లా ధర్మారెడ్డి, పెద్ది సుదర్శన్ రెడ్డి, ఒడితల సతీశ్‌కుమార్, నన్నపునేని నరేందర్, బానోత్ శంకర్ నాయక్, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు నాగుర్ల వెంకటేశ్వర్లు, మర్రి యాదవరెడ్డి, కే వాసుదేవారెడ్డితో కలిసి వినోద్‌కుమార్ శుక్రవారం బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన లక్ష్యంగా 25 ఏండ్ల క్రితం బీఆర్‌ఎస్ పుట్టినప్పుడు.. మూణ్నాళ్లకే పోతుందని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, పీసీసీ అధ్యక్షుడు వైఎస్‌ఆర్ లాంటి వారి మాట్లాడారని చెప్పారు. సమైక్య పార్టీల విమర్శలు తప్పని రుజువు చేస్తూ బీఆర్‌ఎస్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిందని, కొత్త రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిందన్నారు. తెలంగాణ వచ్చేది కాదు, సచ్చేది కాదని మాట్లాడిన సమైక్య రాష్ట్ర పార్టీల నాయకులకు బీఆర్‌ఎస్ ప్రస్థానమే పెద్ద జవాబు అని చెప్పారు. ఏప్రిల్ 27న హుస్నాబాద్ నియోజకవర్గం ఎల్కతుర్తిలో నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ మహాసభ గొప్పగా నిలుస్తుందన్నారు.

## కేసీఆర్‌కు కృతజ్ఞతలు : మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



బీఆర్‌ఎస్ 25 ఏండ్ల సభను ఉమ్మడి వరంగల్ జిల్లాలో నిర్వహించాలని నిర్ణయించిన బీఆర్‌ఎస్ అధినేతకు కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నామని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. ఎల్కతుర్తి మండలకేంద్రంలో 1,214 ఎకరాల్లో సభ నిర్వహించేందుకు రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చారని చెప్పారు. భూములు ఇచ్చి సహకరించిన రైతులకు ధన్యవాదాలు తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ గతంలో లక్షలాది మందితో సభలు నిర్వహించిందన్నారు. సభ నిర్వహణకు అవసరమైన అన్ని అనుమతులకు దరఖాస్తులు చేసినట్లు తెలిపారు.

## గొప్ప మలుపు : ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి



తెలంగాణ ప్రజల కోసం పుట్టిన బీఆర్‌ఎస్ రజతోత్సవ మహాసభ తెలంగాణలో రాజకీయంగా గొప్ప మలుపులకు కారణమవుతుందని ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధన లక్ష్యంగా ఉద్యమించిన బీఆర్‌ఎస్‌కు వరంగల్‌తో సెంటిమెంట్ ఉన్నదని, ఇప్పుడు హనుమకొండ జిల్లాలోని ఎల్కతుర్తిలో బీఆర్‌ఎస్ 25 ఏండ్ల పండుగ జరుగనున్నదని చెప్పారు. లక్షలాదిగా తరలివచ్చే జనాలకు అన్ని రకాల వసతులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. తెలంగాణ ప్రజలు, బీఆర్‌ఎస్ శ్రేణులు లక్షలాదిగా తరలి రావాలని కోరారు.

## విజయవంతం చేస్తాం — మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్



బీఆర్‌ఎస్ 25 ఏండ్ల బహిరంగసభ తాను బాధ్యుడిగా ఉన్న నియోజకవర్గ పరిధిలోని ఎల్కతుర్తిలో నిర్వహించడం గొప్ప నిర్ణయమని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వీ సతీశ్‌కుమార్ అన్నారు. బీఆర్‌ఎస్ రజతోత్సవ మహాసభను విజయవంతం చేస్తామన్నారు.

# బస్సులో కలుషిత తాగునీరు

- సూపర్ లగ్జరీలో వాటర్ బాటిల్‌లో చెత్తాచెదారం
- ఆర్టీసీ యాజమాన్యంపై ప్రయాణికుల ఆగ్రహం

మహదేవపూర్, మార్చి 28 : ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సులో ఇచ్చిన వాటర్ బాటిళ్లలో నీరు కలుషితమైందని ప్రయాణికులు ఆరోపించారు. శుక్రవారం కాళేశ్వరం నుంచి హనుమకొండకు మహదేవపూర్ గుండా వెళ్తున్న టీఎస్ 25 జడ్ 0034 నంబర్ గల సూపర్ లగ్జరీ బస్సులో కలుషిత వాటర్ చూసి కంగుతిన్నారు. మండల పరిధిలోని అంబట్‌పల్లి గ్రామానికి చెందిన పుట్ట సూర్యనారాయణతో పాటు పలువురు ఇదేంటని ప్రశ్నించారు. డ్రైవర్ తన కేమీ సంబంధం లేదని టికెట్ కొన్న ప్రతి ఒక్కరికి ఈ వాటర్ బాటిల్ ఇస్తామని చెప్పాడు. ఏమైనా ఇబ్బంది ఉండే వాటర్ బాటిల్‌తో ఫొటో దిగి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించాడు. టికెట్‌లో వాటర్ బాటిల్‌కు అదనంగా రూ.10 తీసుకుంటున్నప్పుడు కలుషిత నీటిని అందిస్తే అనారోగ్యాల బారిన పడే అవకాశం ఉందని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఆర్టీసీ భూపాలపల్లి డిపో మేనేజర్‌ను వివరణ కోరగా బస్సులో కలుషిత వాటర్ బాటిల్ ఇచ్చారని సమాచారం అందడంతో బస్టాండ్‌లో బస్సును నిలిపి అందులో ఉన్న వాటర్ బాటిళ్లను వెనక్కి తీసుకొని మార్చి ఇచ్చామన్నారు. వాటర్ శాంపిళ్లను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపిస్తామన్నారు. ఇది వరకు ఎన్నడూ ఇలా జరగలేదని, ప్రయాణికుల నుంచి ఫిర్యాదు రావడం ఇదే మొదటిసారని తెలిపారు.



వాటర్ బాటిల్‌ను చూపుతున్న ప్రయాణికుడు

## పోక్సో కేసులో ఇద్దరి అరెస్ట్

*- నిందితుల్లో ఒకరు బాలుడు*

కాటారం, మార్చి 28 : మైనర్ బాలికను వేధించిన ఘటనలో ఇద్దరిపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. కాటారం మండలకేంద్రానికి చెందిన కార్తీక్, ఓ బాలుడు చదువుకు నేందుకు వెళ్లే దారిలో బాలికను అడ్డగించి వేధించడంతో పాటు బెదిరించసాగారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కార్తీక్‌ను రిమాండ్ చేశామని, మైనర్ బాలుడిని జువైనల్ హోంకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

# ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ వేగవంతం చేయాలి



సమీక్షలో ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి, జిల్లా మంత్రులు సీతక్క, కొండా సురేఖ, ఎమ్మెల్యేలు

- బేస్‌మెంట్ లెవల్ పూర్తయిన ఇళ్లకు వెంటనే బిల్లులు చెల్లించాలి
- జూన్ నాటికి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పనులు పూర్తి
- మడికొండ డంపింగ్ యార్డుకు శాశ్వత పరిష్కారం
- స్మార్ట్‌సిటీ పనులపై ప్రత్యేక దృష్టి
- వరంగల్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

వరంగల్,మార్చి 28 : పైలట్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్‌ను వేగవంతం చేయాలని, బేస్‌మెంట్ లెవల్ పూర్తయిన ఇండ్లకు వెంటనే బిల్లులు చెల్లించాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆయా జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో వరంగల్ స్మార్ట్‌సిటీ పనులు, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, ఇందిరమ్మ ఇండ్లు, తాగునీటి సరఫరా,అంశాలపై ఆయన మంత్రులు సీతక్క, కొండా సురేఖ, ముఖ్యమంత్రి సలహాదారుడు వేం నరేందర్ రెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత అంశమని, దీనిని దృష్టిలో ఉంచుకొని కలెక్టర్లు పనిచేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్లకు ప్రభు త్వం నాలుగు విడుతల్లో బిల్లులు చెల్లిస్తుందన్నారు. మొదటి విడుత బేస్‌మెంట్ పూర్తయిన వెంటనే రూ.లక్ష, బేస్‌మెంట్ పూర్తయిన తర్వాత ఇళ్ల వివరాలను ప్రభుత్వానికి పంపిస్తే చెల్లింపులు చేస్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో ఇంటి స్థలాలు లేని అర్హులైన వారికి ఇప్పటి వరకు కేటాయించని డబుల్ బెడ్రూం గృహాలను కేటాయించాలని అధికారులను ఆదేశించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌లను ఆదేశించారు. రానున్న మూడు నెలలు అత్యంత కీలకమని, తాగునీటి ఇబ్బందులు ఉన్నాయన్న విమర్శలు రాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వరంగల్‌లోని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ భవన నిర్మాణ పనులను రెండు నెలల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని, తర్వాత మరో నెల రోజుల్లో వైద్య సేవలకు అవసరమైన పరికరాలను అమర్చాలన్నారు. జూన్ నాటికి దవాఖానను ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. మడికొండలోని డంపింగ్ యార్డుకు ప్రస్తుతం తాత్కాలిక పరిష్కారం చూపి, తర్వాత శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు. వరంగల్, కరీంనగర్ రహదారి మధ్యలో డంపింగ్ యార్డు కోసం 150 నుంచి 200 ఎకరాల భూమిని సేకరించాలని కలెక్టర్లను ఆదేశించారు. భద్రకాళీ చెరువు పూడికతీత పనులు వానకాలం ప్రారంభానికి ముందే పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, యశస్వినీరెడ్డి, దొంతి మాధవరెడ్డి, కేఆర్ నాగరాజు, మురళీనాయక్, రామచంద్రూనాయక్, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణ, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, నగర మేయర్ గుండు సుధారాణి, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్ పాల్గొన్నారు.

# చెడ్డీగ్యాంగ్ కోసం జల్లెడ..

- విద్యారణ్యపురి చోరీ ఘటనతో అప్రమత్తమైన పోలీసులు
- సీపీ ఆదేశాలతో ముఠా కోసం గాలిస్తున్న ప్రత్యేక బృందాలు
- భయం గుప్పిట్లో నగరవాసులు

సుబేదారి,మార్చి28: అత్యంత ప్రమాదకరమైన చెడ్డీగ్యాంగ్ వరంగల్ నగరంలోకి ప్రవేశించడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని కేయూసీ ఫస్ట్ గేట్ ఎదురుగా విద్యారణ్యపురిలో బుధవారం అర్ధరాత్రి జరిగిన చోరీ చేసే క్రమంలో ఆరుగురు ముఠా సభ్యులు చెడ్డీలు, మాస్కులు ధరించి, చేతిలో రాడ్లు, కట్టర్స్ బ్యాగులతో సంచరించిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. దీంతో పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ పోలీసు అధికారులను అప్రమత్తం చేసి, ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సీసీ పుటేజీల ఆధారంగా పోలీసులు అంతర్ రాష్ట్ర చెడ్డి గ్యాంగా.. లేక పార్థివ్ గ్యాంగా? అని అనేక కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. సీసీఎస్, టాస్క్‌ఫోర్స్, లా ఆర్డర్ హనుమకొండ, సుబేదారి, కేయూసీ పోలీసులు టీంలుగా ఏర్పడి నగరాన్ని జల్లెడ పడుతున్నారు. మరోవైపు ముఠా కదలికలు తెలుసు కోవడం కోసం స్థానిక పోలీసులతో నైట్ పెట్రోలింగ్ ముమ్మరం చేశారు. ప్రధాన జంక్షన్లు, బస్ స్టేషన్లు, రైల్వేస్టేషన్లలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. ఈ గ్యాంగ్ మధ్యప్రదేశ్ నుంచి బస్సులో వరంగల్ బస్‌స్టేషన్‌లో దిగినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలినట్లు తెలిసింది. అనంతరం ఎక్క డెక్కడ సంచరించారు?, ఎక్కడ షెల్టర్ తీసుకున్నారు? అనే కోణాల్లో పోలీసులు సీసీ కెమెరాల ద్వారా దర్యాప్తు చేస్తున్నారు. చెడ్డీగ్యాంగ్ నగరంలోకి ప్రవేశించడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈ గ్యాంగ్ అత్యంత ప్రమాదకరమని, చోరీలు చేస్తున్న సమయంలో ఇంట్లో ఎవరైనా అడ్డువస్తే హత్యలు చేయడానికి వెనుకాడరని ఓ పోలీసు అధికారి చెప్పారు. పదేళ్ల క్రితం జనగామ జిల్లా రఘునాథపల్లిలో రోడ్డు పక్కనే ఉన్న హోటల్‌లో రాత్రి సమయంలో చెడ్డి గ్యాంగ్ చొరబడి ఇద్దరిని హత్య చేసిన ఘటన అప్పట్లో సంచలనం రేకెత్తించింది.



విద్యారణ్యపురి కాలనీ సీసీ కెమెరాల్లో నమోదైన చెడ్డీగ్యాంగ్ సభ్యులు




కాజీపేట రైల్వే క్రూ కార్యాలయ లాబీ, బోర్డు

**నాడు సమైక్య పాలనలో కాజీపేట రైల్వే జంక్షన్‌ను అన్ని విధాలా నిర్లక్ష్యం చేసిన ఆంధ్రా రైల్వే ఉన్నతాధికారులు.. ఇప్పుడు డివిజన్ ఏర్పాటు విషయంలో కక్షగడుతున్నారు. కాజీపేట రైల్వే డివిజన్‌గా ఏర్పాటైతే సికింద్రాబాద్, విజయవాడలో ఉన్న అధికారులందరూ ఇక్కడే ఉండి విధులు నిర్వర్తించాల్సి వస్తుందనే కక్షతో అన్ని అర్హతలున్న కాజీపేట రైల్వే జంక్షన్‌ను రైల్వే డివిజన్‌గా కాకుండా తెరవెనుక పావులు కదుపుతున్నారు. కొంతకాలంగా అన్ని విభాగాల కార్మికులతో పాటు ముఖ్యంగా ఎల్పీలు, ఏఎల్పీలు, రైల్వే గార్డుల సంఖ్యను క్రమక్రమంగా తగ్గిస్తూ వస్తున్నారు. దీంతో ఎంతోకాలంగా 'కాజీపేట డివిజన్'పై ఆశలు పెట్టుకొని ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న స్థానికులకు నిరాశ కలిగిస్తోంది. -కాజీపేట, మార్చి 28**

# కాజీపేటపై ఎందుకింత కక్ష?

- రైల్వే డివిజన్ ఆశలు ఆవిరేనా?
- కక్షగట్టిన ఆంధ్రా అధికారులు
- 185మంది లోకో రన్నింగ్ స్టాఫ్‌ను తగ్గించిన దక్షిణ మధ్య రైల్వే
- తెరవెనుక నుంచి విజయవాడకు మద్దతిస్తున్న వైనం
- డివిజన్ ఏర్పాటైతే ఇక్కడే ఉండాల్సి వస్తుందని అధికారుల పన్నాగం

ఉత్తర, దక్షిణ భారతానికి ముఖద్వారంగా, రాష్ట్రంలో రెండో అతి పెద్ద రైల్వే జంక్షన్ అయిన కాజీపేట జంక్షన్‌ను దక్షిణ మధ్య రైల్వేలో కాజీపేట మరో రైల్వే డివిజన్‌గా ఏర్పాటవుతుందని ప్రజలందరు ఆశపడ్డారు. డివిజన్ ఏర్పాటైతే ఇక్కడినుంచి కొన్ని కొత్త రైళ్లు ప్రారంభమవుతాయని అందరు ఆశపడ్డారు. కొత్తగా రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ కోచ్ యూనిట్ రావడంతో అందరిలో కాజీపేట రైల్వే డివిజన్ అవుతుందని ఆశలు చిరుగించాయి. కానీ సీమాంధ్ర పాలనలో ఆంధ్రా రైల్వే ఉన్నతాధికారులు కాజీపేట రైల్వే జంక్షన్‌ను అన్ని విధాలా నిర్లక్ష్యం చేసి, కాజీపేటను రైల్వే డివిజన్ కాకుండా చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల విశాఖపట్నంను సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌గా ప్రకటించడంతో దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలోని విజయవాడ, గుంటూరు, గుంతకల్ రైల్వే డివిజన్లలోకి వెళ్తితే మిగిలిన సికింద్రాబాద్, హైదరాబాద్, నాందెడ్ డివిజన్లు మాత్రమే మిగులుతాయని, అన్ని అర్హతలున్న కాజీపేట రైల్వే డివిజన్‌గా ఏర్పాటవుతుందని భావించారు. కాజీపేట రైల్వే డివిజన్‌గా ఏర్పాటైతే సికింద్రాబాద్, విజయవాడలో ఉన్న అధికారులుందరూ కాజీపేట రైల్వే డివిజన్‌లో ఉండి విధులు నిర్వర్తించాల్సి వస్తుందనే కక్షతో అన్ని అర్హతలున్న కాజీపేట రైల్వే జంక్షన్‌ను రైల్వే డివిజన్‌గా కాకుండా ప్రస్తుత సీమాంధ్ర రైల్వే ఉన్నతాధికారులు పన్నాగం పట్టారు. కొంతకాలంగా కాజీపేటలోని అన్ని విభాగాల రైల్వే కార్మికులతో పాటు ముఖ్యంగా (ఎల్పీలు, ఏఎల్పీలు, రైల్వే గార్డులు)ల సంఖ్యను క్రమక్రమంగా తగిస్తూ వస్తున్నారు. గతంలో కాజీపేట రైల్వే క్రూ లాబీ దాదాపు 790మంది రైల్వే ఎల్పీలు, ఏఎల్పీలు, ఇన్‌స్పెక్టర్లు, రైల్వే గార్డులతో కళకళలాడేది. రెండు రోజుల క్రితం కాజీపేట క్రూ లాబీకి ఉండాల్సిన స్టాఫ్‌లో నుంచి 90మంది లోకో పైలట్లు, 90మంది అసిస్టెంట్ లోకో పైలట్లు, ఐదుగురు లోకో ఇన్‌స్పెక్టర్లు కలిపి మొత్తం 185మంది రైల్వే రన్నింగ్ స్టాఫ్‌ను తగ్గిస్తున్నట్లు రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీ చేయడం కలకలం రేపుతోంది. గతంలో లోకో పైలట్లను విజయవాడకు తరలిస్తే అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ నేతృత్వంలో నిరసనలు, ధర్నాలు, రైల్వే కార్మికులు నిరాహార దీక్షలకు దిగారు. వీరికి స్థానిక వర్తక వాణిజ్య సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు మద్దతు తెలుపడంతో దిగొచ్చిన అధికారులు.. కార్మిక సంఘాల నేతలతో చర్చలు జరిపి తరలించిన కోచింగ్ లింక్‌లను తిరిగి కాజీపేటకు రప్పించారు. కొవిడ్ సమయం నుంచి ఇప్పటివరకు దాదాపు 248 పోస్టులను తరలించారు. ప్రస్తుతం మరోమారు 185మంది లోకో పైలట్లను ఇతర ప్రాంతాలకు తరలించే పనులను రైల్వే ఉన్నతాధికారులు వేగంగా చేస్తున్నారు. కాజీపేట డివిజన్ ఏర్పాటైతే కాజీపేట క్రూ డిపో కీలక పాత్ర పోషిస్తుందని సీమాంధ్ర అధికారులు మరోమారు లోకో రన్నింగ్ స్టాఫ్‌ను తగ్గించి, కాజీపేటను రైల్వే డివిజన్ కాకుండా తెర వెనుక ప్రయత్నాలు చేస్తున్నారు. రైల్వే కార్మిక సంఘాల్లో ఉన్న అధినాయకత్వమంతా ఆంధ్రా ప్రాంతానికి చెందిన వారే అయినందున ఆ ప్రాంతం కార్మికుల లబ్ధి కోసమే, రైల్వే ఉన్నతాధికారుల వద్ద నోరు మెదపకపోవడం వల్లే కాజీపేట రైల్వేపరంగా అన్ని విధాలా నిర్లక్ష్యానికి గురవుతున్నదని కార్మికులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.



ట్రాలీలో ట్యాంకర్‌తో మామిడి తోటకు నీళ్లు పడుతున్న రైతు మల్లయ్య

## ఆటో ట్రాలీతో మామిడి తోటకు నీరు..

జనగామ రూరల్, మార్చి 28: దేవాదుల నీటిని విడుదల చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సాగునీరందక ఓ వైపు పంటలు ఎండిపోతున్నాయి. మరో వైపు మామిడి తోటలను కాపాడుకునేందుకు రైతులు భగీరథ యత్నం చేస్తున్నారు. జనగామ జిల్లా సిద్దెంకి గ్రామానికి చెందిన రైతు ముస్త్యాల మల్లయ్య తనకున్న రెండెకరాల మామిడితోటను రక్షించుకునేందుకు నీటిని కొనుగోలు చేస్తున్నాడు. బోరులో నీరు అడుగంటడంతో పూతకొచ్చి కాతదశలో ఉన్న మామిడిని కాపాడుకునేందుకు ఆటో ట్రాలీలో వాటర్‌ను కొనుగోలు చేసి పైపుల ద్వారా చెట్లకు పడుతున్నాడు. వారానికి రూ.6 వేలు చెల్లిస్తే రెండురోజులకోసారి నీరు సరఫరా చేస్తున్నారని రైతు ముస్త్యాల మల్లయ్య చెప్పాడు.